# కరెంట్ అఫైర్స్

1. పశ్చిమ బెంగాల్ పేరును 'బంగ్లా'గా మార్చేందుకు ప్రతిపాదించిన తీర్మానాన్ని ఆ రాష్ట్ర అసెంబ్లీ ఏ రోజున ఆమోదించింది? (దీనిలో బెంగాలీతో పాటు ఆంగ్లం, హిందీలోనూ రాష్ట్రం పేరును బంగ్లాగానే పేర్కొన్నారు. ఆంగ్ల అక్షర వరుస క్రమంలో పశ్చిమ బెంగాల్ తొలి అక్షరం 'డబ్ల్యూ' చివరన ఉండటంతో, రాష్ట్రం పేరును మొదటకు తీసుకురావడమే లక్ష్యంగా ఈ ప్రతిపాదన చేశారు. దీన్ని కేంద్ర హోంశాఖ ఆమోదించాల్సి ఉంది.)

1) 2018, జులై 24　　2) 2018, జులై 25
3) 2018, జులై 26　　4) 2018, జులై 27

2. 'కార్గిల్ విజయ్ దివస్'ను ఏ రోజున నిర్వహిస్తారు?

1) జులై 25　　2) జులై 26　　3) జులై 27　　4) జులై 28

3. 2018, జులై 26న ఆంధ్రప్రదేశ్‌లోని ఏ జిల్లాలో శ్రీ వరాహ నృసింహస్వామి గిరి ప్రదక్షిణను వైభవంగా నిర్వహించారు?

1) గుంటూరు　　2) విశాఖపట్నం　　3) కర్నూలు　　4) అనంతపురం

4. 'డెవిల్స్ అడ్వొకేట్: ద అన్‌టోల్డ్ స్టోరీ' పుస్తకాన్ని ఇటీవల ఎవరు రచించారు?

1) కరణ్ థాపర్　　2) అర్ణబ్ గోస్వామి
3) రాజ్‌దీప్ సర్దేశాయ్　　4) రజత్ శర్మ

5. రాష్ట్రంలోని బీసీ కులాల నుంచి 36 అర్ధసంచార తెగలు, విముక్త జాతులు, సంచార జాతులను ఎంబీసీలుగా (అత్యంత వెనుకబడిన కులాలు) గుర్తిస్తూ 2018, జులై 26న ఏ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది? (35 కులాలతో పాటు అనాథలను కూడా ఎంబీసీ జాబితాలో చేర్చింది.)

1) తెలంగాణ　　2) ఆంధ్రప్రదేశ్　　3) తమిళనాడు　　4) కేరళ

6. ఇటీవల ఏ నగరంలో ముగ్గురు బాలికలు ఆకలితో మరణించిన ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది?

1) ముంబయి　　2) కోల్‌కతా　　3) బెంగళూరు　　4) దిల్లీ

7. '2018 ఫిఫా గోల్ ఆఫ్ ది టోర్నమెంట్'గా ఏ క్రీడాకారుడు కొట్టిన గోల్ ఎంపికైంది? (మొత్తం ప్రపంచకప్‌లో 64 మ్యాచ్‌ల్లో 169 గోల్స్ నమోదు కాగా ఫిఫా నిర్వహించిన ఆన్‌లైన్ పోల్‌లో ఈ క్రీడాకారుడు కొట్టిన గోల్ అత్యధిక ఓట్లతో గోల్ ఆఫ్ ది టోర్నమెంట్‌గా ఎంపికైంది. అర్జెంటీనాతో జరిగిన నాకౌట్ మ్యాచ్‌లో తమ జట్టు వెనుకబడిన సమయంలో ఈ ఆటగాడు గోల్ పోస్ట్‌కు 20 గజాల దూరం నుంచి గోల్ కొట్టి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. 2006లో అర్జెంటీనా క్రీడాకారుడు మ్యాక్సి రోడ్రిగెజ్, 2010లో ఉరుగ్వే క్రీడాకారుడు డిగో ఫ్లోరాన్, 2014లో కొలంబియా ఫుట్‌బాలర్ జేమ్స్ రోడ్రిగెజ్ చేసిన గోల్స్ ఆయా టోర్నీల్లో అత్యుత్తమ గోల్స్‌గా ఎంపికయ్యాయి.)

1) హ్యారీకేన్, ఇంగ్లండ్
2) లూకా మోడ్రిక్, క్రొయేషియా
3) బెంజమిన్ పవార్డ్, ఫ్రాన్స్
4) ఆంటోనీ గ్రీజ్‌మాన్, ఫ్రాన్స్

8. భారత 14వ రాష్ట్రపతిగా రామ్‌నాథ్ కోవింద్ బాధ్యతలు చేపట్టి ఏ రోజుకు ఏడాది పూర్తైంది? (రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఏడాదిలో సగటున రోజుకు 34 మందితో భేటీ అయ్యారని, దేశంలోని 27 రాష్ట్రాల్లో పర్యటనలు జరిపారని, కేంద్ర ప్రభుత్వానికి చెందిన 30 బిల్లులకు, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన 59 బిల్లులకు ఆమోదముద్ర వేశారని, వీటితోపాటు 12 ఆర్డినెన్స్‌లను ఆమోదించారని రాష్ట్రపతి భవన్ ప్రకటించింది. ఏడాది కాలంలో భారత సందర్శనకు వచ్చిన 8 మంది దేశాధ్యక్షులకు ఆతిథ్యం ఇచ్చారని, పది దేశాల్లో పర్యటించారని వెల్లడించింది.)

1) జులై 21　　2) జులై 23　　3) జులై 25　　4) జులై 27

**9.** నలభై ఏళ్ల వయసులోనే అత్యంత ప్రభావశీల, స్ఫూర్తిదాయక వ్యాపారవేత్తలుగా రాణించిన 40 మందితో ఫార్చ్యూన్ రూపొందించిన జాబితాలో అగ్రస్థానంలో నిలిచింది ఎవరు? (ఈ నలభైమందిలో నలుగురు భారతీయ సంతతికి చెందిన వారు. అమెరికా దిగ్గజ వాహన తయారీ సంస్థ జనరల్ మోటార్స్ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ దివ్యా సూర్యదేవర 4వ స్థానంలో నిలిచారు. విమియో సీఈఓ అంజలి సూద్ 14వ స్థానంలో, రాబిన్‌హుడ్ సహ వ్యవస్థాపకులు, సహ సీఈఓ బజ్జు భట్ 24వ స్థానం, ఫిమేల్ ఫౌండర్స్ ఫండ్ వ్యవస్థాపక భాగస్వామి అను దుగ్గల్ 32వ స్థానంలో నిలిచారు.)

1) ఇన్‌స్టాగ్రామ్ సహ వ్యవస్థాపకుడు కెవిన్ సిస్ట్రోమ్

2) ఫేస్‌బుక్ వ్యవస్థాపకుడు మార్క్ జుకర్‌బర్గ్

3) వాట్సాప్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి జాన్ కౌమ్

4) 1, 2

**10.** ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం అమలుపై రాజ్యసభలో ఏ రోజున స్వల్పకాలిక చర్చ జరిగింది?

1) 2018, జులై 21 2) 2018, జులై 22

3) 2018, జులై 23 4) 2018, జులై 24

**11.** ఏ దేశానికి చెందిన ప్రముఖ స్పోర్ట్స్ కార్ల తయారీ సంస్థ పగానీ ఆటోమొబైల్ 'పగానీ జోండా హెచ్‌పీ బార్‌చెట్టా' పేరుతో ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన కారును ఇటీవల రూపొందించింది? (దీని ధర 13.5 మిలియన్ యూరోలు - దాదాపు రూ. 121 కోట్లు; 2018, జులై 12 నుంచి 15 వరకు ఇంగ్లండ్‌లో జరిగిన గుడ్‌వుడ్ ఫెస్టివల్ ఆఫ్ స్పీడ్‌లో ఈ కారును ప్రదర్శించారు. ఈ కారు బరువు 1250 కిలోలు. కార్బన్ - టైటానియం మిశ్రమలోహాలతో దీన్ని తయారు చేశారు. ఇది 3.1 సెకన్లలో 100 కిలో మీటర్ల వేగాన్ని అందుకోగలదు. 355 కిలోమీటర్ల గరిష్ఠ వేగంతో ప్రయాణించగలదు. ఇటువంటి కార్లను కేవలం మూడింటినే తయారు చేశారు. కంపెనీ వ్యవస్థాపకుడు హొరాసియో పగానీ ఒక కారును అట్టి పెట్టుకోగా, మిగతా రెండు ఇప్పటికే అమ్ముడుపోయాయి. ఇప్పటి వరకు ప్రపంచంలోనే ఖరీదైన కారుగా రోల్స్ రాయిస్ స్వెప్‌టెయిర్ (రూ. 84 కోట్లు) ఉంది.)

1) ఆస్ట్రియా 2) ఫ్రాన్స్ 3) ఇటలీ 4) డెన్మార్క్

**12.** జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత, దివంగత డాక్టర్ సి. నారాయణ రెడ్డి పేరిట ఇచ్చే సినారె సాహితీ పురస్కారాన్ని 2018 సంవత్సరానికి ఎవరికి ప్రదానం చేశారు? (సినారె జయంతి సందర్భంగా 2018, జులై 28న హైదరాబాద్‌లో ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ పురస్కారం కింద రూ. 25 వేల నగదు, జ్ఞాపిక అందజేశారు.)

1) డాక్టర్ పెన్నా శివరామకృష్ణ 2) డాక్టర్ జుర్రు చెన్నయ్య

3) డాక్టర్ దేవులపల్లి శ్రీధర్ 4) డాక్టర్ కె.వి. రమణాచారి

**13.** కింది అంశాల్లో సరైనవి గుర్తించండి.

ఎ) మూక హింస, మూకలు హత్యలకు పాల్పడే సంఘటనల నియంత్రణకు ఉన్న మార్గాలను, చట్టపరమైన చర్యలను సూచించేందుకు కేంద్ర ప్రభుత్వం రెండు ఉన్నతస్థాయి కమిటీలను ఏర్పాటు చేసింది.

బి) ఒక కమిటీకి కేంద్ర హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ నేతృత్వం వహిస్తారు. మరో కమిటీకి కేంద్ర హోంశాఖ కార్యదర్శి రాజీవ్ గౌబా నేతృత్వం వహిస్తారు.

సి) రాజీవ్ గౌబా కమిటీలో న్యాయ, శాసన విభాగ, సామాజిక, న్యాయ, సాధికారత విభాగాల కార్యదర్శులు సభ్యులుగా ఉంటారు. హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన మంత్రుల బృందంలో విదేశీ వ్యవహారాల మంత్రి సుష్మాస్వరాజ్, రవాణా మంత్రి నితిన్ గడ్కరీ, న్యాయశాఖమంత్రి రవిశంకర్ ప్రసాద్, సామాజిక న్యాయ సాధికార మంత్రి థావర్ చంద్ గెహ్లాట్ సభ్యులుగా ఉంటారు.

డి) రాజీవ్ గౌబా కమిటీ సిఫారసులను రాజ్‌నాథ్ బృందం పరిశీలించిన తర్వాత తన సిఫారసులను ప్రధాని మోదీకి సమర్పిస్తుంది.

1) ఎ, బి, సి 2) ఎ, బి, డి 3) ఎ, బి 4) అన్నీ

**14.** ఆదాయపు పన్ను విభాగం గణాంకాల ప్రకారం 2017 – 18 ఆర్థిక సంవత్సరంలో తెలుగు రాష్ట్రాల్లో ఆదాయపు పన్ను వసూళ్లు ఎంతగా నమోదయ్యాయి? (2016 – 17 ఆర్థిక సంవత్సరంలో తెలుగు రాష్ట్రాల్లో ఆదాయపు పన్ను వసూళ్లు రూ. 39,865 కోట్లు. 2017 – 18లో తెలుగు రాష్ట్రాల్లో అత్యధికంగా ఎన్ఎండీసీ రూ. 2259 కోట్ల కార్పొరేట్ పన్ను చెల్లించింది. తర్వాతి స్థానంలో ఆంధ్రా బ్యాంకు (రూ. 475 కోట్లు ) అమరరాజా బ్యాటరీస్ (రూ. 237 కోట్లు) ఉన్నాయి. రూ. 100 కోట్లకు పైగా మొత్తాన్ని కార్పొరేట్ పన్నుగా చెల్లించిన కంపెనీలు కేవలం 17 మాత్రమే ఉన్నాయి.)

1) రూ. 43,775 కోట్లు 2) రూ. 45,775 కోట్లు

3) రూ. 47,775 కోట్లు 4) రూ. 49,775 కోట్లు

**15.** బాలికల పొదుపు పథకం 'సుకన్య సమృద్ధి యోజన'లో మరింత మందిని భాగస్వాములను చేసేందుకు వీలుగా కేంద్ర ప్రభుత్వం ఏటా తప్పనిసరిగా జమ చేయాల్సిన కనిష్ఠ పొదుపు మొత్తాన్ని రూ. వెయ్యి నుంచి ఎంతకు తగ్గించింది. (ఇకపై ఖాతా తెరవడానికీ ఇంతే మొత్తం ఉంటే చాలు.)

1) రూ. 850 2) రూ. 650 3) రూ. 450 4) రూ. 250

**16.** 2017 సంవత్సరానికి అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య (ఏఐఎఫ్ఎఫ్) 'ప్లేయర్ ఆఫ్ ది ఇయర్' పురస్కారాన్ని ఇటీవల ఎవరికి ప్రకటించింది? (ఈయన ఇటీవలే 100 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడిన రెండో భారతీయుడిగా ఘనత సాధించాడు. 'ఉమెన్ ప్లేయర్ ఆఫ్ ది ఇయర్' పురస్కారాన్ని కమలాదేవి దక్కించుకుంది.)

1) విశాల్ కైత్ 2) సునీల్ ఛైత్రి 3) గుర్‌ప్రీత్ సింగ్ 4) సుభాశిష్ బోస్

**జవాబులు**

1-3; 2-2; 3-2; 4-1; 5-1; 6-4; 7-3; 8-3; 9-4; 10-4; 11-3; 12-1; 13-4; 14-4; 15-4; 16-2.

## ఆసియా జూనియర్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్

★ ఆసియా జూనియర్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పురుషుల సింగిల్స్ టైటిల్‌ను 16 ఏళ్ల ఉత్తరాఖండ్ క్రీడాకారుడు లక్ష్యసేన్ నెగ్గాడు. ఫైనల్లో డిపెండింగ్ ఛాంపియన్ కులావత్ వితిసన్ (థాయ్‌లాండ్)ను ఓడించాడు.

★ భారత్ తరపున ఈ టైటిల్ సాధించిన మూడో షట్లర్‌గా లక్ష్యసేన్ ఘనత సాధించాడు. గౌతమ్ థక్కర్ (1965), పీవీ సింధు (2012) గతంలో ఈ టైటిల్ సాధించారు.

★ సింధు (2011 – కాంస్యం), సమీర్ వర్మ (2011 – రజతం, 2012 – కాంస్యం), ప్రణవ్ చోప్రా – ప్రజక్త సావంత్‌లు (2009 మిక్స్‌డ్ డబుల్స్ – కాంస్యం) ఆసియా జూనియర్స్‌లో పతకాలు సాధించారు.

★ తాజాగా ఆసియా జూనియర్ టైటిల్ గెలిచి చరిత్ర సృష్టించిన లక్ష్యసేన్‌కు భారత బ్యాడ్మింటన్ సమాఖ్య (బాయ్) రూ. 10 లక్షల నజరానా ప్రకటించింది.

## మోదీ మూడు ఆఫ్రికా దేశాల పర్యటన

★ 2018, జులై 23 నుంచి 27 వరకు ప్రధాని నరేంద్రమోదీ రువాండా, ఉగాండా, దక్షిణాఫ్రికాల్లో పర్యటించారు. జులై 23న రువాండా రాజధాని కిగాలీ చేరుకున్నారు. ఈ తూర్పు ఆఫ్రికా దేశానికి భారత ప్రధాని రావడం ఇదే తొలిసారి.

★ జులై 24న రువాండా అధ్యక్షుడు పాల్ కగామేతో మోదీ ద్వైపాక్షిక చర్చలు జరిపారు. పేదరికాన్ని తగ్గించి, పిల్లల్లో పౌష్టికాహార లోపాన్ని అధిగమించే లక్ష్యంతో రువాండాలో పేద కుటుంబాలకు ఆవులను ఇచ్చే 'గిరింకా' కార్యక్రమానికి భారత్ తరపున 200 గోవులను మోదీ కానుకగా సమర్పించారు. రువాండా పర్యటన అనంతరం మోదీ ఉగాండా చేరుకున్నారు.

★ జులై 25న ఉగాండా పార్లమెంట్‌ను ఉద్దేశించి ప్రసంగించారు. ఇలా ప్రసంగించిన తొలి భారత ప్రధానిగా మోదీ. ఉగాండా అధ్యక్షుడు యొవెరి ముసెవెనితో మోదీ ద్వైపాక్షిక చర్చలు జరిపారు. అనంతరం బ్రిక్స్ దేశాల సదస్సులో పాల్గొనేందుకు మోదీ దక్షిణాఫ్రికా వెళ్లారు.

★ జులై 26, 27 తేదీల్లో జోహెన్నెస్‌బర్గ్‌లో జరిగిన బ్రిక్స్ దేశాల 10వ శిఖరాగ్ర సదస్సులో మోదీ పాల్గొన్నారు. ఈ సదస్సుకు మోదీతో పాటు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రమఫోసా, బ్రెజిల్ అధ్యక్షుడు మిచెల్ తెమర్, రష్యా

అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ హాజరయ్యారు. ఉగ్రవాదాన్ని అంతం చేయడానికి సమగ్ర వ్యూహం అవసరమని బ్రిక్స్ కూటమి పిలుపునిచ్చింది.

**ఆర్చరీ జట్టుకు కాంస్యం**

**ఆం**ధ్రప్రదేశ్ ఆర్చర్ వెన్నం జ్యోతి సురేఖతో కూడిన భారత మహిళల కాంపౌండ్ ఆర్చరీ జట్టు కొత్త చరిత్ర సృష్టించింది. 2018, జులై 26న అంతర్జాతీయ ఆర్చరీ సమాఖ్య విడుదల చేసిన ప్రపంచ ర్యాంకింగ్స్‌లో తొలిసారి అగ్రస్థానానికి చేరింది.

★ ఇటీవల బెర్లిన్‌లో ముగిసిన ఆర్చరీ ప్రపంచకప్ స్టేజ్-4 టోర్నమెంట్ కాంపౌండ్ టీమ్ విభాగంలో జ్యోతి సురేఖ, త్రిష దేబ్, ముస్కాన్ కిరార్‌లతో కూడిన భారత జట్టు రజతం గెలుచుకుంది. ఇటీవల కాలంలో విశేష ప్రతిభ కనబర్చిన భారత జట్టులో వీరితోపాటు లిలీచాను, దివ్యా దయాళ్, మధుమిత కూడా సభ్యులుగా ఉన్నారు. ఈ విజయంతో భారత జట్టు 342.6 పాయింట్లతో ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానానికి చేరింది. చైనీస్ తైపీ జట్టు రెండో ర్యాంకులో నిలిచింది. జ్యోతి సురేఖ ఈ ప్రపంచకప్‌లో రజతంతో పాటు కాంస్యం కూడా గెలుచుకుంది. మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో ఆమె అభిషేక్ వర్మతో కలిసి కాంస్యం నెగ్గింది.

➝ 2020లో టోక్యో నగరంలో జరగనున్న ఒలింపిక్స్ మస్కట్ పేర్లను 'మిరాయ్ తోవా', 'సోమైటీ'గా ఖరారు చేశారు. పొడవాటి చెవులతో నీలి రంగులో ఉన్న 'మిరాయ్ తోవా' ఒలింపిక్స్ మస్కట్ కాగా, గులాబీ రంగులో ఉన్న 'సోమైటీ' పారాలింపిక్స్ మస్కట్.

**రచయిత: సీహెచ్. కృష్ణ ప్రసాద్**

www.eenadupratibha.net
www.eenadupratibha.net